క్లుప్తంగా

ఢిల్లీ సీఎంను కలిసిన ఆప్ నాయకులు



సీఎం కేజ్రీవాల్‌తో ఆప్ నాయకులు

నల్లగొండ టౌన్ : ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను బుధవారం హైదరాబాద్‌లో ఆప్ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు ఇందిరాశోభన్, డాక్టర్ దిడ్డి సుధాకర్‌రెడ్డి, శోభన్‌బాబు భూక్యా, జిల్లా నాయకులు డాక్టర్ అన్సారీ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో ఆప్ పార్టీ నిర్మాణంపై చర్చించారు.

నేడు బీసీ సింహగర్జన

నల్లగొండ : బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం జరిగే బీసీ విద్యార్థుల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగం లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, బీసీ సంఘం జాతీయ కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేష్, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లేపల్లి అంజిలు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

నల్లగొండ : పోలీస్ నియామకాల్లో భాగంగా చేపట్టిన ఈవెంట్స్‌లో జరిగిన అవకతవకలపై యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజారమేష్‌యాదవ్ పిలుపు మేరకు గురువారం నల్లగొండ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు కోరారు. బుధవారం నల్లగొండలోని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువజన కాంగ్రెస్ నాయకుడు మామిడి కార్తీక్, యూత్ కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి తబ్రేజ్, మర్రి దేవేందర్‌యాదవ్, నవీన్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

అనుమతి రద్దు చేసేవరకు పోరాడుతాం



మాట్లాడుతున్న ఎంపీటీసీ సైదులు

మునుగోడు : ఫార్మా కంపెనీ అనుమతి రద్దు చేసేంతవరకు పోరాడుతామని కిష్టాపురం ఎంపీటీసీ భీమనపల్లి సైదులు అన్నారు. బుధవారం ఆ గ్రామంలో అఖిలపక్ష పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గట్టుప్పల్ గ్రామంలోని కంపెనీని ఎలాగైతే రద్దు చేశారో అదేతరహాలో తమ గ్రామ శివారులో నిర్మిస్తున్న కంపెనీ అనుమతి వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ నందిపాటి రాధారమేష్, ఉప సర్పంచ్ ఆకుల అనిల్, వార్డు సభ్యులు మారమ్మ, సతీష్, రవి, భూపాల్ పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



విద్యార్థి అఖిల్‌ను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ రజనీకాంత్

నల్లగొండ : ఈ నెల 21, 22, 23 తేదీల్లో రంగారెడ్డి జిల్లా నందిగామలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ టోర్నమెంట్‌కు నల్లగొండ పట్టణంలోని స్రవంతి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి అఖిల్ ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అఖిల్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అఖిల్‌ను స్రవంతి హైస్కూల్ కరస్పాండెంట్ వారణాసి రజనీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

బహుమతులు అందజేత



బహుమతులు అందిస్తున్న కాటం వెంకటేశం

చిట్యాల : గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు బుధవారం ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నలివేరు సుగుణమ్మ, నీలకంఠం నరేష్, తోటకూరి బాలమల్లు, తెల్జూరి సైదులు, చిలుకల ఇద్దయ్య పాల్గొన్నారు.

అర్ధాకలితో మున్సిపల్ కార్మికులు !

- ప్రతినెలా వేతనాలు సరిగ్గా అందక అవస్థలు
- రెండు సంవత్సరాలుగా ఇదేతీరు



చండూరు మున్సిపల్ కార్యాలయం

చండూరు : చండూరు మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెలా సమయానికి వేతనాలు అందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. రెండు సంవత్సరాలుగా వేతనాలు పెండింగ్ పడుతూ వస్తున్నాయి. రెండు నెలలకు ఒకసారి ఒక నెల వేతనం అందిస్తూ, మిగిలిన వేతనాలను పెండింగ్‌లో పెడుతూ వస్తున్నారు. ప్రతిరోజు పనిచేసి ఇంటికి వెళ్తే రెండు పూటలా భోజనం చేయలేకపోతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినెలా అప్పులు తెచ్చుకుని పూట గడుపుకుంటున్నామని కార్మికులు చెబుతున్నారు.

ప్రతినెలా రూ.7.50 లక్షలు..

మున్సిపల్ కార్యాలయ పరిధిలో 50 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. వీరందరికీ కలిపి ప్రతినెలా రూ.7.50 లక్షలు వేతనాల రూపంలో అందించాల్సి ఉంది. జనరల్ ఫండ్ లేకపోవడంతో వేతనాలు అందించడంలో ఆలస్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఒక నెల వేతనం అందించి, రెండు నెలల వేతనం పెండింగ్‌లో పెట్టారు. రెండు సంవత్సరాలుగా వేతనాలు ఆలస్యంగానే అందిస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

40 శాతం పన్ను వసూలు..

మున్సిపల్ పరిధిలో పన్నుల వసూలు నామమాత్రంగానే ముందుకు సాగుతోంది. ప్రతి ఏడాది లక్ష్యాన్ని చేరుకోవడంతో అధికారులు విఫలమవుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 40 శాతం వరకు పన్నులు వసూలు అయ్యాయి. మార్చి వరకు మిగిలిన 60 శాతం వసూలు చేయాల్సి ఉంది.

జనరల్ ఫండ్ లేక ఆలస్యం



మున్సిపాలిటీకి చెందిన జనరల్ ఫండ్ జమ కాకపోవడంతో వేతనాలు సమయానికి అందించలేకపోతున్నాం. మార్చి చివరి వరకు పన్నులు వసూలు చేస్తాం. కార్మికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. మున్సిపాలిటీలోని ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలి.

–వెంకట మణికరణ్,
మున్సిపల్ కమిషనర్

మెరుగైన సేవలు అందించేందుకు కృషి



నకిరేకల్‌లో క్యాలెండర్ విడుదలచేస్తున్న సుధా బ్యాంక్ ఎండీ పెద్దిరెడ్డి గణేశ్, తదితరులు

నకిరేకల్ : ఖాతాదారులకు మెరుగైన సేవలందించడంతోపాటు బ్యాంకు పురోభివృద్ధికి కృషిచేస్తున్నామని సుధా బ్యాంక్ ఎండీ పెద్దిరెడ్డి గణేశ్ అన్నారు. నకిరేకల్‌లోని సుధా బ్యాంక్ సిబ్బంది ఆత్మీయ సమ్మేళనాన్ని స్థానిక గీతా మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నకిరేకల్‌లో 12 ఏళ్ల క్రితం సుధా బ్యాంకు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంక్ క్యాలెండర్, బ్రోచర్‌ను విడుదల చేశారు. సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పానుగోటి నిర్మల, డైరెక్టర్లు బోనగిరి భాస్కర్, కక్కిరేణి చంద్రశేఖర్, ఖాతాదారులు సూర్యకుమార్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మతోన్మాదులను శిక్షించాలి

నల్లగొండ టౌన్ : నిజామాబాద్ జిల్లాలో దళిత ఉపాధ్యాయుడిపై దాడిచేసిన మతోన్మాదులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ బుధవారం నల్లగొండ పట్టణంలో వారు ఆందోళన చేపట్టారు. అద్దంకి నర్సింహ, సైదాచారి, రవికుమార్, పెరిక కృష్ణ, పేర్ల సంజీవ, ఎల్లమ్మ, శ్రీనివాస్, లింగమ్మ పాల్గొన్నారు.

ఖమ్మం సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



నల్లగొండలో ర్యాలీగా వెళ్తున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల, తదితరులు



నకిరేకల్ : ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, తదితరులు

నల్లగొండ : ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ జాతీయ మహాసభకు నల్లగొండ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. బుధవారం నల్లగొండలోని ఎన్జీ కళాశాల నుంచి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వెళ్లే కాన్వాయ్‌ని జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ రమేష్‌గౌడ్, పంకజ్‌యాదవ్, మల్లేష్‌గౌడ్, మైనం శ్రీనివాస్, జమాల్‌కాద్రి, మాలే శరణ్యారెడ్డి, జాన్ శాస్త్రీ తదితరులు తరలివెళ్లారు. అదేవిధంగా బీఆర్ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు పిల్లి రామరాజు ఆధ్వర్యంలో దాదాపు 15 బస్సులు, 50 కార్లల్లో కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. కూతురు జానారెడ్డి, నక్క వెంకటేశం తదితరులు ఉన్నారు.

నకిరేకల్‌లో..

నకిరేకల్ : బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభకు నకిరేకల్ నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. బుధవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నకిరేకల్‌లో జెండా ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి తదితరులు తరలివెళ్లారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్ : మండలంలోని బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభకు భారీగా తరలివెళ్లారు. జెడ్పీటీసీ తరాల బలరాములుయాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి ఏడుకొండలు, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు తదితరులు సభకు వెళ్లినవారిలో ఉన్నారు.

మర్రిగూడ : ఖమ్మంలో సీఎం కేసీఆర్ బహిరంగ సభకు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్ తదితరులు ఉన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నల్లగొండ : పీఏపల్లి మండలం అంగడిపేట వద్ద బాలికను అత్యాచారం చేసి చంపిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్ వద్ద టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా త్వరగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సైదులు ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం, ఉపాధ్యక్షురాలు పి అరుణ, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, జి.అరుణ, రమాదేవి, పి.విజయలక్ష్మి, సీహెచ్ వరలక్ష్మి, ఎస్ వెంకన్న, నరసింహ, మురళయ్య తదితరులు పాల్గొన్నారు.

నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలి

మునుగోడు : పీఏ పల్లి మండలంలో బాలికపై అత్యాచారం చేసి హత్యచేసిన నిందితులను వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలని బీఎస్పీ మహిళా విభాగం నియోజకవర్గ కన్వీనర్ కత్తుల పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మునుగోడులో ఆమె విలేకర్లతో మాట్లాడారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగడం వల్లనే మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయిని అన్నారు. గ్రామాల్లోని బెల్టు దుకాణాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నల్లగొండ రూరల్ : పట్టణంలోని మమత హైస్కూల్‌లో చదివిన 1994–95 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు బుధవారం స్థానిక లయన్స్‌క్లబ్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్య బోధించిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలీం, వెంకట్రాంరెడ్డి, సరళ, అనిల్, భాగ్యలత, శేఖర్, కవిత, రమాదేవి, నాగేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఓక్‌ట్రీ పాఠశాల చైర్మన్ గింజల నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఏకలవ్య పాఠశాల యాజమాన్యం

రామగిరి(నల్లగొండ) : ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో పట్టణంలోని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల చైర్మన్ అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. పాఠశాలకు చెందిన పి.వాణి, ఎమ్.అనన్యతోపాటు 13 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ కరుణాకర్‌రెడ్డి, డైరెక్టర్ మారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓక్‌ట్రీ విద్యార్థుల ప్రతిభ

మ్యాథ్స్ ఒలింపియాడ్స్ ఫలితాల్లో ఓక్ ట్రీ పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల చైర్మన్ గింజల నరేందర్‌రెడ్డి, డైరెక్టర్ గడ్డం మంగారెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు టి.తనుశ్రీ 33వ ర్యాంకు, ఎస్.రాహుల్ సూరజ్ 42, టి.అక్షిత 99 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు.

మండల కమిటీ ఎంపిక

చండూరు(గట్టుప్పల) : చండూరు, గట్టుప్పల మండలాల సీపీఎం నూతన కమిటీని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం బుధవారం ప్రకటించారు. గట్టుప్పల మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపికచేశామని ఆయన తెలిపారు. చండూరు అధ్యక్షుడిగా మొగుదాల వెంకటేష్, సహాయ కార్యదర్శిగా జెర్రిపోతుల ధనంజయ్య, గట్టుప్పల మండల అధ్యక్షుడిగా కర్నాటి మల్లేశం ఎంపికయ్యారు.

నేటినుంచి 'కంటి వెలుగు' శిబిరాలు



కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నల్లగొండ మున్సిపల్ కమిషనర్ రమణాచారి



తిప్పర్తిలో కంటి వెలుగు శిబిరంలో అద్దాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి



నల్లగొండలో కంటి వెలుగు ఫ్లెక్సీలను సిద్ధం చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

నల్లగొండ టౌన్ : పట్టణంలో గురువారం నుంచి నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రమణాచారి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, వైద్యఆరోగ్యశాఖల సిబ్బందితో కంటి వెలుగు ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. కంటి వెలుగు కేంద్రాల వద్ద ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని కంటివెలుగు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ బి.రాములు, డిప్యూటీ ఈఈ పి.అశోక్‌కుమార్, ఎన్.నర్సింహారెడ్డి, బి.వెంకన్న, ఏసీపీ నాగిరెడ్డి, ఏఈ రవీందర్, రెవెన్యూ అధికారులు మహ్మద్ ఖాజాఆరీఫుద్దీన్, కె.పవన్‌కుమార్, వార్డు ఆఫీసర్లు, డెటా ఎంట్రీ ఆపరేటర్‌లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

రామగిరి(నల్లగొండ) : కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నల్లగొండ ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. బుధవారం తిప్పర్తి మండల కేంద్రంలోని కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా వార్డుల వారీగా తేదీలు ఖరారు చేసి కంటి పరీక్షలు నిర్వహించాలని వైద్యులకు సూచించారు. తహసీల్దార్ కృష్ణయ్య, వైద్యులు ఎం.ప్రదీప్‌బాబు, సీహెచ్‌ఓ సోమయ్య తదితరులు ఉన్నారు.

చిట్యాలలో..

చిట్యాల : స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రారంభిస్తారని చిట్యాల పీహెచ్‌సీ వైద్యాధికారి జి.కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి కంటి అద్దాలు ఉచితంగా ఇస్తారని పేర్కొన్నారు.

కంటి వెలుగు శిబిరాల పరిశీలన

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ దేశ్యానాయక్, ఎంపీడీఓ పోరెళ్ల సునిత కోరారు. బుధవారం మండలంలోని చెర్వుఅన్నారం, కట్టంగూర్ గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాలను వారు పరిశీలించి మాట్లాడారు. కంటి చూపుతో బాధపడేవారు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాథమిక వైద్యాధికారి శ్వేత, ఎంపీఓ అథర్ ఫర్వేజ్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్‌లు ఉన్నారు.

మునుగోడు : కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ జమీర్ కోరారు. కంటి వెలుగు కార్యక్రమంపై బుధవారం మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరికీ కంటి పరీక్షలు చేయించాలని సూచించారు. సీహెచ్‌ఓ రమాదేవి, సూపర్‌వైజర్లు మంగీబాయి, అశ్వక్, నిర్మలాదేవి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. మునుగోడు మండల కేంద్రంతోపాటు గంగోరిగూడెం గ్రామంలో గురువారం కంటి వెలుగు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు డాక్టర్ జమీర్ తెలిపారు. ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మర్రిగూడ : మండలంలోని వట్టిపల్లి, మర్రిగూడ గ్రామాల్లో గురువారం కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుందని మర్రిగూడ ప్రభుత్వ వైద్యుడు దీపక్ తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ సీఎం ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి



నల్లగొండలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

నల్లగొండ రూరల్ : ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో, మెయిన్ సెంటర్‌లో ఆయన విగ్రహానికి టీడీపీ నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుమ్మల మధుసూదన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. శేఖర్‌రెడ్డి, ఆకునూరి సత్యనారాయణ, రమేష్, ఇస్తారి, విజయ్‌కుమార్, రవి, చంద్రశేఖర్, సిద్దిక్, సైదులు, మనోహర్, సత్తయ్య పాల్గొన్నారు.

నకిరేకల్ : ఎన్‌టీఆర్ వర్ధంతిని నకిరేకల్ పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ ఇన్‌చార్జ్ యాతాకుల అంజయ్య, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి కృష్ణారెడ్డి, సైదులు, పుణ్యమూర్తి, లింగన్న రాచకొండ లింగయ్య పాల్గొన్నారు.

చిట్యాల: ఎన్‌టీఆర్ వర్ధంతిని చిట్యాలలో బుధవారం టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొంపెల్లి అశోక్, పట్టణ అధ్యక్షుడు అర్రూరి సత్తయ్య, ప్రధానకార్యదర్శి బోడ విజయ్‌కుమార్, మేడి లింగయ్య, బోయపల్లి మల్లేశం పాల్గొన్నారు.

కట్టంగూర్ : ఎన్‌టీఆర్ వర్ధంతిని మండల కేంద్రంలో నిర్వహించారు. పార్టీ భువనగిరి పార్లమెంటరీ కమిటీ ప్రధాన కార్యదర్శి నూకల శ్రీధర్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గద్దపాటి వెంకటేశ్వర్లు, తిరుమలేష్, మండల ప్రధాన కార్యదర్శి నందకుమార్, రామకృష్ణ, యాదయ్య ఉన్నారు.

చండూరు : చండూరు మండల కేంద్రంలో ఎన్‌టీఆర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జక్కలి ఐలయ్యయాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఎర్రజెల్ల లింగయ్య, మక్కిన అప్పారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోసుకొండ వెంకటేశ్, ఆందోని, గంట అంజయ్య, తోకల యాదయ్య, కనకయ్య తదితరులు ఉన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి భువనగిరి పార్లమెంట్ తెలుగు యువత మాజీ ప్రధాన కార్యదర్శి ముద్దం శ్రీనివాస్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. పగడాల లింగయ్య, పుప్పాల అంజయ్య, కాసర్ల అంజయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

శిథిలావస్థలో మునుగోడు గ్రంథాలయం



మునుగోడు : నియోజకవర్గ కేంద్రమైన మునుగోడులోని గ్రంథాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. 2001లో నిర్మించిన ఈ గ్రంథాలయానికి ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో స్లాబ్ పైభాగంలో పెచ్చులూడి వర్షం వచ్చినప్పుడు కురుస్తోంది. దీంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయం నిర్మించిన సమయంలో కొందరు దాతలు వివిధ రకాల పుస్తకాలను అందజేశారు. ప్రస్తుతం అందులో కొన్ని కనిపించడం లేదు. పాఠకులకు అవసరమైన పుస్తకాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. ఉన్నవాటితో కొందరు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. గ్రంథపాలకుడు సైతం లేకపోవడంతో మూడేళ్లుగా ఇన్‌చార్జ్ గ్రంథపాలకుడే దిక్కయ్యింది. మరుగుదొడ్ల సమస్య ఉండడంతో గ్రంథాలయానికి వచ్చే మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పాఠకులు కోరుతున్నారు.

డ్రెయినేజీ లేక అవస్థలు



వెలిమినేడులోని బొడ్రాయి బజార్‌లో నిలిచిన మురుగు

చిట్యాల : వెలిమినేడు గ్రామంలోని బొడ్రాయి బజార్‌లో డ్రెయినేజీ లేకపోవడంతో మురుగు నీరు వీధి మధ్యలో నిలుస్తోంది. మురుగు వీధి మధ్యలో నిలిచిపోవడంతో బురదమడుగులా మారి పాదచారుల, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మురుగులో ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతుండడంతో ఆ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని సర్పంచ్‌కు పలుమార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆ గ్రామ ఎంపీటీసీ దేశబోయిన స్వరూపనర్సింహ, ఎస్ఎఫ్ఐ నాయకులు గోలి సాయికిరణ్, కూరాకుల బాలు ఆరోపిస్తున్నారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులు స్పందించి మురికి కాల్వ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత



నల్లగొండలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న డాక్టర్ వర్షిత్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని 8వ వార్డుకు చెందిన బీజేపీ కార్యకర్త జోరీగల యాదగిరి గుండెపోటుతో మరణించడంతో బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి బుధవారం యాదగిరి మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పోతెపాక లింగస్వామి, నాగం హాస్పిటల్ మేనేజర్ ఫకీరు మోహన్‌రెడ్డి, శాంతి స్వరూప్ పాల్గొన్నారు.

నకిరేకల్ : మండలంలోని కడపర్తి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఉడుగు మధు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు దైద రవీందర్ పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

రోడ్డెక్కిన వారాంతపు సంత



మునుగోడులోని రోడ్డుపై అస్తవ్యస్తంగా మారిన ట్రాఫిక్ (ఫైల్)

మునుగోడు : మండల కేంద్రంలో ప్రతి గురువారం జరిగే వారాంతపు సంతను రోడ్డుపైనే నిర్వహిస్తున్నారు. దీంతో సాయంత్రం సమయంలో రాకపోకలు జరిపే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై నిర్వహిస్తున్న సంతను ఎనిమిదేళ్ల క్రితం అప్పటి ఎంపీడీఓ సంతకు కేటాయించిన స్థలంలోనే వ్యాపారులు తమ వస్తువులను అమ్ముకునేవిధంగా చర్యలు తీసుకున్నారు. కాగా మూడేళ్ల క్రితం ఆ సంత నిర్వహించే స్థలంలో సగభాగం సిరి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు నాబార్డు సహాయంతో రూ.10 లక్షలు ఖర్చుచేసి షెడ్లు ఏర్పాటు చేశారు. కానీ షెడ్లు వేసిన స్థలంలో వ్యాపారులు వ్యాపారం కొనసాగించకుండా రోడ్డుపై వస్తువులు పెట్టి అమ్ముకుంటున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అయినా ఈ విషయాన్ని పట్టించుకునేవారే కరువయ్యారు. సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రోడ్డుపై వ్యాపారాలు కొనసాగించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.